

# పసిడిమనసులు - షర్మిల



## కళ్లల్లో కాంచనగంగ

**నేనూ నాయనమ్మా** మొత్తానికి బెజవాడ నుంచి హషిమారా చేరాం.

ఎయిర్ ఫోర్స్ ట్రక్ వచ్చింది అందులో మా సామానుతో సహా ఎక్కాం.

కొన్ని మైళ్లు వెళ్లాక. ఒక పెద్ద గేటు లోనుంచి అన్నీ ఒకేరకంగా కట్టిన ఇళ్లున్న వూరులోకి వెళ్లింది . "ఈ వూరు పేరేంటి?" అని నాన్నని అడిగితే అవి ఎయిర్ ఫోర్స్ క్వార్టర్లని వూరు కాదని చెప్పారు. నాకైతే ఇది వేరే ప్రపంచంలాగా అనిపించింది. నేను వుండే మా బార్లపూడిలోలాగా పెంకుటిళ్లు, గొడ్ల చావిళ్లు, పంచెలు కట్టుకున్న వాళ్లు ఎవరూ లేరు .

అందరు ముదురు ఆకుపచ్చ రంగు బట్టలు, బూట్లు వేసుకుని వున్నారు. వాటిని యూనిఫారం అంటారంట.

ఇక్కడ అడవుల మధ్యలో లేత ఆకుపచ్చ రంగులో వున్న ఈ క్వార్టర్లు శత్రుదేశ విమానాలకు పైనుంచి చూస్తే అడవుల్లో కలిసిపోయి కనబడవట.

ట్రక్ ఆగింది. సామాను దించినాక క్వార్టర్లో వున్న కింద ఇంటికి వెళ్లాం. అమ్మ, చిన్న తమ్ముడు మాకు ఎదురు వచ్చారు.

మా పెద్ద తమ్ముడు, నేనూ వూర్లో తాత, చిట్టెమ్మ దగ్గరే వుంటాం వాడిని మా చిన్న నాయనమ్మ దగ్గర వదిలేసి వచ్చాం.

హషిమారా నాకు చాలా నచ్చేసింది .

క్వార్టర్లు దాటి వెళ్తే చిన్న నది మరీలోతుగా లేకుండా జలజల పారుతుంటుంది. ఆ నది దాటితే చిట్టెడవి దాన్ని ఆనుకుని పెద్దనది. ఆ నదికి అవతల పెద్ద అడవి.

పెద్దనది అవతలి ఒడ్డుకు ఒంటి కొమ్ము వున్న ఖడ్గమృగాలు, పులులు మిగతా జంతువులు నీళ్లు తాగడానికి వస్తాయంట. ఇవన్నీ చూసి నేను చదివే చందమామ కథలు గుర్తొచ్చాయి .

" అమ్మా ! ఇక్కడ పక్కనే వున్న జల్ద్ పారా అడవిలోనే ఒంటికొమ్ము ఖడ్గమృగం ప్రత్యేకం. మనం ఈ ఆదివారం ఏనుగు సవారీ మీద ఆ అడవికి వెళ్దాం" అని నాన్న చిట్టెమ్మకు చెప్పడంతో ఏనుగు ఎక్కుతానన్న సంబరంతో ఉక్కిరిబిక్కిరయ్యాను.

రోజూ పది గంటలనుంచి ఒంటి గంట వరకూ విమానాలు రకరకాలుగా గిరికీలు కొడతాయి. యుద్ధంవస్తే బాంబులు ఎట్లా వేయాలో ప్రాక్టీస్ అంట.

అస్సాం అక్కడకి దగ్గరే ! ప్రతి ఆదివారం అక్కడ తే తోటల్లో జరిగే సంతకి నాన్నతో వెళ్లా.

కొండలంతా నిండిన ఆకుపచ్చ తేయాకు తోటల మధ్యన సంతలో రంగు రంగుల గొడుగుల కింద అన్నిరకాల వస్తువులు, కూరగాయలు, పళ్లూ అమంతున్నారు.

ఆ రంగులు భలే వున్నాయి.

మరో ఆదివారం సినిమాకి బయల్దేరాం. సినిమా హాలు భూటాన్ లో వుంది. ఎయిర్ ఫోర్స్ ట్రక్ లో పిల్లలూ పెద్దలూ అంతా ఎక్కి రాజేష్ ఖన్నా ఆనంద్ సినిమా చూసి వచ్చాం.

నేను రోజూ క్వార్టర్లకి దగ్గరలో వున్న జల్ద్ పారా గెస్ట్ హౌస్ దగ్గరకి వెళ్ళేదాన్ని. అక్కడ రోజూ ఏనుగులకి చిన్న నదిలో స్నానాలు చేయిస్తారు. వాటంతట అవే తొండాలతో నీళ్లు తీసుకుని వంటిమీద పోసుకునేవి.

మేం వెళ్లేలోగా డార్జిలింగ్ తీసుకెళ్లాలని నాన్న రిజర్వేషన్ చేయించారు. సిలిగురి వరకు రైల్లో వెళ్లి అక్కడనుంచి ఒక జీప్ లో డార్జిలింగ్ బయల్దేరాం.

ఆ జీప్ లో మాతో పాటు తెల్లవాళ్లు కూడాఎక్కారు.

వాళ్ల పక్కనుంచి అదేంటో వాసన వచ్చింది. నేను ముక్కు మూసుకుని కూర్చున్నాను.

అందులో ఒకతను ఆస్ట్రేలియా అంట. మా నాయనమ్మ ప్రపంచంలో ఎవరైనా సరే వాళ్లతో సోది మొదలెడుతుంది.

ఆ ఆస్ట్రేలియా ఆయనతో మా బాబాయి ఉద్యోగం సంగతి మొదలెట్టింది.

"స్మాల్ సన్ ...ఆస్ట్రేలియా జాబ్ ...హెల్ప్ "అని అడగడం మొదలెట్టంది.

వాళ్ల దేశం లో ప్రస్తుతం టీచింగ్ అయితే బాగుంటుందని మీ అబ్బాయిని పంపితే సాయంచేస్తానని మాట ఇచ్చాడు.

డార్జిలింగ్ కొండలపైన వుంది. దారి పొడుగునా ఆ పెద్ద పర్వతాల నిండా జలపాతాలు కనిపించాయి.

డార్జిలింగ్ చేరాం. అక్కడ మబ్బులన్నీ కింద మా తలల మీదుగా వెళ్తున్నాయి.

" ముకుందా ! నారదుడు మబ్బుల్లో నడుస్తున్నట్టు సినిమాల్లో చూపిస్తే ఏంటో అనుకున్నాను ... ఇక్కడ అట్టాగే వుందరా " అంది చిట్టెమ్మ.

అక్కడ వర్షం, చలి ఎక్కువగా వుంది. రంగు రంగుల గొడుగులు, స్వెటర్లు అమ్ముతున్నారు.

నల్ల గొడుగు తప్ప చూడని నాకు వీటిని చూస్తూనే వుండాలనిపించింది .

నాకు ముదురు ఎరుపు గొడుగు , తమ్ముడికి మూడురంగుల గొడుగు కొన్నారు.

మర్నాడు పొద్దున్నే నిద్ర లేపేశారు. టైగర్ హిల్స్ దగ్గర సూర్యోదయం భలే వుంటుందంట. పైగా అక్కడ హిమాలయాలు కనిపిస్తాయంట.

అక్కడికి చేరుకున్నాం గానీ అన్నీ మబ్బులు కమ్మేశాయి ... సూర్యుడే కనబడలా.

చాలాసేపు అక్కడే జనాలు అక్కడే వుండిపోయారు.

ఇంతలో మబ్బుల వెనక చిన్న వెలుగు !

అందరూ రెప్పవాల్చకుండా చూస్తుండగానే ఎర్రటి బంతిలాగా సూర్యుడొచ్చాడు.

ఆ వెలుగులో దూరంగా మంచు కొండలు.

కాంచఝుంగా శిఖరం తళతళ మెరుస్తూ స్వర్గం అక్కడే వుందా అన్నట్టు కనిపించింది.

మా నాయనమ్మ కళ్లల్లో నీటితో దండాలు పెట్టింది.

దేవతలు, ఆ ఆది దంపతులూ అక్కడే వుంటారంది.

" ముకుందా ! బార్లపూడి బెజవాడ తప్ప ఎరగను. నీ పుణ్యమా అని హిమాలయాలనే చూశాను" అని ఆయన బుగ్గలు నిమిరి, నుదుటి మీద ముద్దుపెట్టింది.

అప్పుడు మా నాన్న కళ్లు  సూర్య కిరణాలు పడిన  కాంచనఝుంగా శిఖరంలా  మెరిసిపోయాయి .

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments